# వయసు మనసు

- యం.సూర్యప్రసాదరావు

"నేను అతన్ని ప్రేమించాను" సంధ్య తడుముకోకుండా జవాబు చెప్పింది.

"ప్రేమించాను. అంటే.." తల్లి సుజాత రెట్టించింది.

"ప్రేమించాను అంటే ఐ లవ్ హిమ్! అతను లేనిదే నేను బ్రతకలేను. అతని తోడిదే లోకం. అతని తోనే నా స్వర్గం. అతను లేకుంటే జీవితమే నరకం"

కూతురి మాటలకు సుజాత అవాక్కయిపోయింది.

అర్ధరాత్రి సూట్‌కేస్‌తో గడపదాటబోతూ తనకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిపోయిన కూతురిలో ఎలాంటి గిల్టీ ఫీలింగ్ కనబడలేదు. పై పెచ్చు.. నిర్మోహమాటంగా, నిష్కర్షగా గుండెలు తీసిన బంటులా ఎంతో ఖచ్చితంగా చెబుతోంది.

సంధ్య తలుపుతీయబోతుంటే అడిగింది. "ఎక్కడికే?"

సమాధానం చెప్పకుండానే తలుపు తీసింది. బయటకు అడుగేసింది.

"ఇంత రాత్రప్పుడు... ఎవరితోనే వెళ్ళేది?"

"అతనితోనే.." సంధ్య నిర్ణయించుకున్న సమాధానం.

"ఎవరే అతను?"

"అతనే.. ఆ వీధి చివర నిలుచున్న అతనే"

సుజాత బయటకు వచ్చి వీధి చివరికంటా దృష్టి సారించింది.

ఎవరూ కనిపించలేదు.

"ఎవరే అతను?" లాలనగా కుమార్తెను అడిగింది.

"అతను భాస్కర్..." సంధ్య సమాధానం చెప్పింది.

"భాస్కర్! పేరు సరే ఇంతకూ అతను ఎవరు? ఏం చేస్తుంటాడు? ఏ ఊరివాడు?" సుజాత అడగాల్సిన ప్రశ్నలన్నీ అడిగేసింది.

"అతను భాస్కర్ అనే తెలుసు. డిగ్రీ కంప్యూటర్ సైన్స్ చదివాడు. ఇక్కడ ఏదో కంప్యూటర్ సెంటర్‌లో పనిచేస్తున్నారు" సంధ్య అమాయకంగా చెప్పింది.

"అసలు మీ ఇద్దరికీ ఎలా పరిచయం కలిగిందే?"

కుమార్తె ప్రేమ వృత్తాంతం ఆమెకు తెలుసుకోవాలని అనిపించింది. తలుపు గడియ వేసి హాల్లోకి తీసుకువచ్చింది.

"ఏముందీ! అతను రోజూ నన్ను ఫాలో అయ్యేవాడు. మొదటి వారంరోజులు పట్టించుకోలేదు. మరో వారంరోజులు ఫాలో అవుతూ మమ్మల్ని దాటిపోయి ఎదురుగా వచ్చేవాడు. మేం ఇద్దరం ముగ్గురం ఉన్నా ప్రత్యేకించి నన్నే చూసేవారు"

సంధ్య తన్మయత్వంగా చెప్పుకుపోతూనే ఉంది.

"రెండోవారం నన్ను కనులనిండుగా చూసేవాడు. మూడోవారం నన్ను పేరుపెట్టి పిలిచాడు. ఆదివారం ఎక్స్‌ట్రా క్లాసులున్నా ఫాలో అయ్యేవారు. నాల్గవవారం మొదటిరోజున 'ఐ లవ్ యూ' అన్నాడు. రెండోరోజు 'ఐ లవ్ యూ...సంధ్యా' అన్నాడు. ఆ వారమంతా 'ఐ లవ్ యూ' నామ జపం చేశాడు. ఆ మూడు అక్షరాలు నాకు మతిపోయేలా చేశాయి. పదిరోజులపాటు 'ఐ లవ్‌యూ' నామజపం చేస్తూ నా చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేసేవారు"

"అంతే! నువ్వు మనసు పారేసుకున్నావు గదూ!" సుజాత సంధ్య మాటలకు అడ్డు వచ్చింది.

"అవునమ్మా! మనసు పారేసుకున్నాను. అభిమానంగా..ప్రేమగా... పిలిచే వారి ముందు...మనల్ని ప్రేమించే వారి ముందు మనసు పారేసుకుంటే తప్పేముందమ్మా!" అమాయకంగా అంది.

"అంటే 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అన్నమాట"

తల్లి మాటలకు సంధ్య తలదించుకుంది.

'ఐ లవ్ యూ... ఐ లవ్ యూ.. ఐ లవ్ యూ! టీవీలనుండి, స్టేజ్‌పోల నుండీ, సినిమాలనుండీ వినిపించే ఒకేఒక తారకమంత్రం. అది తప్పితే జీవితంలో మరొకటి లేదనీ, అది లేకపోతే జీవితమే శూన్యమనీ..జీవితాన్ని ఆ ప్రణవ మంత్రానికీ, ప్రణయ మంత్రాకీ అంకితం చేసుకోమనీ ప్రబోధించే సన్నివేశాలు, సంఘటనలూ ఎన్నో..ఎన్నెన్నో. యువతను హిప్నటైజ్ చేసే పవర్‌ఫుల్ ఎలక్ట్రానిక్ మీడియా సందేశాల ఫలితం.. సందేహం లేదు.

దాని ప్రభావం తన కుమార్తెపై పడింది. దాని నుండి సంధ్యను రక్షించుకోవాలి.

"అతడి కులం గురించి అడగను. గోత్రం గురించి అడగను. అతనికి నిన్ను పోషించగలిగే సంపాదన ఉందా! నీ కనీస అవసరాలు తీర్చగలిగే ఆదాయం ఉందా! పెద్దల్ని ఎదిరించి రమ్మన్న నిన్ను సరిగ్గా చూసుకోగలిగే ధైర్యం ఉందా?" అడిగింది.

"ఉందనే అనుకుంటున్నాను" సంధ్య నీళ్ళు నమిలింది.

"ధైర్యం ఉంటే అతను నన్ను చూడగానే ఎందుకు పారిపోయాడంటావ్? అతను నిన్ను ప్రేమించలేదు. నీ డబ్బును ప్రేమించాడు. అది ప్రేమకాదు.. ఆకర్షణ. నువ్వు తీసుకువెళ్ళిన డబ్బు అయిపోయిన తరువాత నిన్ను చెత్తకుండీలోకి విసిరేస్తాడు"

సుజాత కూతురి ముఖంలో రంగు మార్పిడి చెందడాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది.

"అమ్మా!" సంధ్య భయపడింది.

"అవునురా!టీనేజ్ మహాత్మ్యమే అంత! థర్టీన్ నుండి నైన్‌టీన్ నిండే దాకా లోకమంతా ఓ అందమైన హరివిల్లులా కనిపిస్తుంది. కనుల ముందుండే జీవితం ఓ రంగులకలగా ఉంటుంది. మెరిసేదంతా బంగారమూ కాదు. ఆకర్షణంతా ప్రేమకాదు"

"భాస్కర్ నిజంగా నన్ను ప్రేమించాడమ్మా! నేను లేకుండా జీవించలేనంటున్నాడు. నేనే లేకపోతే బ్రతకలేనంటున్నాడు. పెళ్లంటూ చేసుకుంటే నన్నే పెళ్ళి చేసుకుంటానంటున్నాడు. లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటున్నాడు" సంధ్య ఆర్తోక్తిగా అంది.

"మరి... నీ సంగతేమిటి?" సుజాత అడిగింది.

"నేనూ... అంతేనమ్మా! పెళ్లంటూ చేసుకుంటే

అతన్నే చేసుకుంటాను. అతన్ని చేసుకోకపోతే''

"చేసుకోకపోతే...''సుజాత రెట్టించింది.

"ఆత్మహత్య చేసుకుంటాను'' సంధ్య స్థిరంగా అంది.

ఎవరైనా చేసేవారు చెప్పరు. చెప్పేవారు చేయరు. ఆ విషయం సుజాతకు తెలియంది కాదు. 'ఆత్మహత్య చేసుకుంటాను' అనే నెగెటివ్ దృక్పథంలోంచి మొదట కుమార్తెకు చదువులో ఓ టార్గెట్ నిర్దేశించి పాజిటివ్ మార్గానికి పట్టుకురావాలి. అప్పుడు ఆమె తన దారిలోకి వస్తుంది.

"సుజాతా! పిల్లలకు తల్లి ఆదిగురువు. ఆకలి వేసినప్పుడు 'అమ్మా' అంటారు. దెబ్బ తగిలినప్పుడు 'అమ్మా' అని ఏడుస్తారు. బాధల్లో మొదటి సారిగా గుర్తుకువచ్చేది అమ్మే! అందుకే ఆమె క్షమయా ధరిత్రి అయ్యింది. ఆడపిల్ల వ్యవహారం అంత సున్నితమైంది. అందులోనూ టీనేజ్ ఆడపిల్లను టాకిల్ చేయడం కత్తిమీద సాము లాంటిది. ప్రేమలో పడ్డ అమ్మాయిని ఆ విషవలయంలోంచి బయటపడేయడాన్కి ఎంతో ఓర్పు, నేర్పు కావాలి. టీచర్‌గా ఎందరి విద్యార్థుల మనస్తత్వాలనో నిత్యం డీల్ చేసే నీకు సంధ్య వ్యవహారానికి పరిష్కారం స్ఫురించకపోదు. కానీ దాని ప్రేమ వ్యవహారం నీకు తెలిసినా తెలియనట్లు నటించు. ఏమీ ఎరగనట్లు సాదాసీదాగా ప్రవర్తించు. దాని వ్యవహారం నీకు తెలిసిందని పసిగట్టిన మరుక్షణం. ఇహ నీతో దాగుడుమూతలుండవ్! ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధమవుతుంది. జాగ్రత్త!''


భర్త క్యాంప్‌కి వెళ్తూ కూతురి వ్యవహారం విన్న తరువాత చెప్పిన మాటలు ఆమెలో ఆత్మవిశ్వాసం కలిగించాయి. అందుకే అప్పటినుంచి సంధ్యను కంటికి రెప్పలా చూసుకుంది. నీడలా వెన్నాడింది. కనుకనే ఆఖరికి ఇంటినుండి బయటకు వెళ్ళబోయే ముందు పట్టుకోగలిగింది. ఆపగలిగింది.

"ఆత్మహత్య చేసుకుంటావా?'' సుజాత రెట్టించింది.

"చేసుకుంటాను''

"చేసుకోనక్కర్లేదు'' ఆమె గొంతు స్థిరంగా అంది.

'అంటే...' సంధ్య ముఖంలో సంభ్రమాశ్చర్యాలు.



"అంతే.. నువ్వు అతన్నే పెళ్ళి చేసుకుందువుగానీ.."

తల్లి సమాధానాన్ని సంధ్య ఊహించలేదు.

పాలపొంగులాంటి ఆవేశం చల్లారిపోయింది.

"నిజమా...మమ్మీ!" సంధ్య ఊహించని పరిణామం.

"నీకు పెళ్ళంటూ జరిగితే అతనితోనే జరిపిస్తాను. నీ ఇష్టప్రకారమే పెళ్ళి జరుగుతుంది" సుజాత మాట ఇచ్చింది.

సంధ్య ఊహించిన దానికి విరుద్ధంగా జరిగింది.

"తల్లి తన ప్రేమను నిరాకరిస్తుంది. వద్దని ఖచ్చితంగా చెబుతుంది. పోట్లాడుతుంది. తను ఇంట్లోంచి బయటకు వచ్చేస్తుంది"

"కానీ ఒక్క షరతు.." తల్లి విధించబోతున్న షరతు ఏమిటోనని క్షణకాలం సంధ్య ఆందోళన చెందింది.

"ఏమిటి..మమ్మీ!"

"నిజంగా నువ్వు అతన్నే ప్రేమిస్తే అతను నిన్ను ప్రేమించిందీ నిజమైతే..నువ్వు మనస్ఫూర్తిగా అతనినే చేసుకోవాలనుకుంటే నువ్వు డిగ్రీ పూర్తిచేయాలి. అతను ఓ మంచి పర్మినెంట్ ఉద్యోగం సంపాదించుకోవాలి. అందుకు కనీసం ఓ ఏడాది పడుతుంది. తరువాత ఇద్దరికి నేనే పెళ్ళిచేస్తాను"

"నాన్న ఒప్పుకుంటారా?" సంధ్య అనుమానంగా అంది.

"తప్పకుండా ఒప్పుకుంటారు? నీ సుఖం కాకపోతే..మా ఇద్దరికీ ఇంకేం కావాలమ్మా! అందాకా అతనికి నువ్వు దూరంగా ఉండాలి. కనిపించినా మాట్లాడకూడదు. చదువుపై మనసు లగ్నం చేయాలి. సరేనా! అలాగని హామీ ఇవ్వాలి"

"అలాగే మమ్మీ" సంధ్య తల్లి చేతిలో చేయి వేసింది.

అరగంట తరువాత కిటికీ అద్దాలపై రెండుమూడుసార్లు టార్చిలైట్ వెలుతురు పడినా సుజాత పట్టించుకోలేదు. సంధ్య అంతకన్నా పట్టించుకోలేదు.

మరో ఆరునెలలకే సంధ్య యోగ్యుడైన వరుని ముందు తలవంచుకుని కూర్చుంది మనస్ఫూర్తిగా తాళి కట్టించుకోవడానికి.

"సంధ్యా! జీవితంలో ప్రేమించేవారు ఒకరిద్దరే ఉంటారు. ఆకర్షించేవాళ్ళు చాలామంది ఉంటారు. నేను తల్లితండ్రీలేని అనాథను. ఇతరుల దయాధర్మాలపై ఆధారపడి డిగ్రీ పూర్తిచేశాను. ట్రెయినింగ్ పొందని టీచర్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాను. అప్పుడే ఎదురింటిలో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉన్న మీ నాన్న పరిచయమయ్యారు. మా పరిచయం ప్రేమగా మారడాన్కి రెండేళ్ళు పట్టింది. మేము పెళ్ళి చేసుకోవడానికి మరో ఆరుమాసాలు పట్టింది.

నన్ను నన్నుగా ప్రేమించి తన జీవిత భాగస్వామినిగా చేసుకున్న మీ నాన్నగారి పట్ల నేను చూపించాల్సింది ప్రేమకాదమ్మా! భక్తి! అనురక్తి. ప్రేమకు పరాకాష్ఠ భక్తి. అందుకే నిన్ను ఆలోచించుకోమన్నది. ఆవేశపడవద్దన్నది. నైన్‌టీన్ దాటి ట్వంటీలోకి ప్రవేశించావు. ఆలోచించి ఆలోచించి ఓ మంచి నిర్ణయం తీసుకో"

తల్లి అపారమైన అనుభవం ముందు సంధ్య తలవంచింది. ఆమె పాజిటివ్ ఆలోచనలకు తలఊపింది. అతని ప్రేమ క్షణికమైందనీ, పాల పొంగులాంటి వయసు మనసు ఆవేశం గ్రహించింది. ఆలోచనలో పడింది. ఆమె విశ్లేషణ ముందు తలవంచుకుంది.

'నిజమే! భాస్కర్‌ది ప్రేమకాదు. ఆకర్షణ. అందుకే అతని కోసం తనను కని పెంచి, తనపై అంతులేని ఆశల్ని పెంచుకున్న తల్లిదండ్రుల్ని ఎందుకు త్యాగం చేయాలి. బిఎస్సీ డిస్టింక్షన్‌లో పాసయిన తనకు తనకంటే ఎక్కువ క్వాలిఫికేషన్స్ ఉన్న వరుడు కావాలి. తనను పువ్వులా పెట్టి చూసుకోగలిగే ఆర్థికస్తోమత ఉండాలి. అందుకే అన్నివిధాలా తనకంటే ఉన్నతస్థాయిలో ఉన్న ఆర్థికంగా నిలదొక్కుకున్న తల్లిదండ్రులు ఎంపికచేసిన వరుని ముందు తలవంచుకుని కూర్చుంది"

"పుట్టుకతోనే ఎవరూ పాపాత్ములు కాదు సుజాతా! వారిలోని రాక్షసులన రూపుమాపితే రసజ్ఞులు అవతరిస్తారు. దుర్మార్గపు ఆలోచనలనుండి వారిని దూరం చేస్తే ఆవేశం నుండి ఆలోచనవైపు మళ్లిస్తే దైవాలుగా దర్శనమిస్తారు. ప్రయత్నించు. సంధ్యలోని దురాలోచనను దూరాలోచనగా మార్చడానికి ప్రయత్నించు. ఆ స్థానంలోనే విచక్షణాశక్తి, వివేచనా సామర్థ్యం మొలకెత్తాయి. ఆ శక్తే ఆమె భవిష్యత్తుకు బంగారుబాట వేస్తుంది"

తన ఆలోచనలతో అచంచల విశ్వాసం కలిగించిన భర్త వైపు ఆనందంగా చూసుకుంటూ సంధ్యపై అక్షింతలు చల్లించి

"మొట్టమొదట నిన్ను ప్రేమించేది నేనూ మీ నాన్నగారూ.. నీ తమ్ముడూ మా ప్రేమ నిజమైందమ్మా. అది ఆకర్షణ కాదు. అందుకే మా ప్రేమ విజయం సాధించింది. నీ ఆకర్షణ మా ప్రేమ ముందు ఓడిపోయింది. ఐ లవ్ యూ బేబీ ఉయ్..లవ్ యూ...సంధ్యా! నిన్ను మేము జీవితమంతా ప్రేమిస్తూనే ఉంటాం

సుజాత మనస్ఫూర్తిగా దీవించింది.

## వృశ్చిక జాతులు

ప్రపంచమంతట తేళ్లల్లో ఎనిమిది వందలరకాలు ఉన్నాయి. వీటిలోని ఐదు జాతులు ఆఫ్రికా సియెర్రా లియోన్‌లో ఉన్నాయి. గత 335 కోట్ల సంవత్సరాల నుండి వృశ్చికజాతిలో మార్పులేనట్లు వృశ్చిక శిలాజాల వల్ల తెలుస్తుంది. ఇవి ఆహారం, నీరు లేకుండా ఒక సంవత్సరకాలం జీవిస్తాయి. కొన్నిరకాలు నీటి అడుగున కూడా నివశిస్తాయి.

## మానసికోల్లాసం

ఏ విధమైన కపటం, కల్మషం లేని మనుషులు నిర్భయంగా జీవిస్తారు. సుఖదుఃఖాలు, కష్టనష్టాలు సమానంగా స్వీకరిస్తారు. జీవితంలో ఏ విధమైన ఒడిదుడుకులు ఎదురైనా ధైర్యాన్ని, మనోబలాన్ని, ఆత్మస్థైర్యాన్ని కోల్పోరు. మరణాన్ని కూడా ధైర్యంగా ఎదుర్కొంటారు. ధైర్య సాహసాలను ఎన్నడూ విడనాడరు. మనసులో సంతోషం, ఉత్సాహం, ముఖంలో దివ్యతేజస్సును కలుగజేస్తుంది.

## ఫింగర్ ప్రింట్స్

భారతదేశంలో ప్రప్రథమంగా చేతివ్రేళ్ళ గుర్తులతో నేర పరిశోధన 1855వ సంవత్సరంలో ప్రారంభమైంది. గ్రేట్ బ్రిటన్‌లో 1902వ సంవత్సరంలో గజదొంగ హోలీ జాక్సన్ దోచుకున్న ఇంటికి అప్పుడే పెయింట్ చేసిన గోడమీద అతని చేతివ్రేళ్ళ గుర్తుల ఆధారంగా అతడిని పట్టుకున్నారు.

- రాంబాబు

